క్లుప్తంగా

నేడు మహతిలో ఓబీసీ మహాసభ

తిరుపతి కల్చరల్ : తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో సోమవారం జాతీయ ఓబీసీ మహాసభ నిర్వహించనున్నట్లు ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజగౌడ్, రఘుపతి తెలిపారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. బీసీలపై కేంద్రప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించనున్న మహాసభకు జాతీయ నేతలు హాజరవనున్నట్లు వెల్లడించారు. బీసీల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు వివరించారు.సమావేశంలో సంఘం నేతలు జ్ఞానజగదీష్, సుబ్రమణ్యం నాయుడు, మధు, సోమశేఖర్ ఆచారి, కిరణ్, నరేష్, జయచంద్ర పాల్గొన్నారు.

టీటీడీ ట్రస్ట్‌లకు విరాళం



తిరుమల: టీటీడీ ట్రస్ట్‌లకు తిరుమలకు చెందిన నరహరి కుసుమ దంపతులు రూ.3 లక్షల విరా ళం అందజేశారు. అన్నదానం ట్రస్టుకు రూ. 2 లక్షలు, చిన్న పిల్లల హార్ట్ సర్జరీ పథకానికి రూ. లక్ష చొప్పున డీడీని ఈఓ ధర్మారెడ్డికి అందజేశారు.

అవార్డుల ప్రదానం



తిరుపతి కల్చరల్: పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ వ్యవస్థాపకుడు సి.రమాకాంత్ శర్మకు బెస్ట్ పబ్లిక్ రిలేషన్ కౌన్సిల్ అవార్డు, తిరుపతి చాప్టర్ అధ్యక్షురాలు ప్రొఫెసర్ త్రిపుర సుందరికి బెస్ట్ పబ్లిక్ రిలేషన్ టీచర్ అవార్డు లభించింది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డులు అందుకున్నారు. వీరికి అవార్డులు రావడంపై తిరుపతి చాప్టర్ చైర్మన్ శ్రీనివాసరావు, కార్యదర్శి చంద్ర మోహన్, తిరుపతి చాప్టర్ వైస్ చైర్మన్ చంద్రమోహన్‌రావు హర్షం వ్యక్తం చేశారు.

డాన్స్ షో పోస్టర్ల ఆవిష్కరణ

చంద్రగిరి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15వ తేదీ సాయంత్రం రాక్ స్టార్ ఈవెంట్ ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ మండలం పుదిపట్లలో మెగా లైవ్ డాన్స్ షో జరగనుంది. ఆదివారం తిరుపతిలో గల్లీ బాయ్ సద్దాం హుస్సేన్, రాక్ స్టార్ ఈవెంట్ అధినేత అశోక్ పోస్టర్లను ఆవిష్కరించారు.

నిద్రిస్తున్న మహిళ మెడలో చైన్ చోరీ

చంద్రగిరి(తిరుపతి రూరల్): రాత్రి వేళ హోటల్ ముందు నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి దొంగలు బంగారు కాసుల హారాన్ని అపహరించిన సంఘటన ఆదివారం మామండూరులో చోటుచేసుకుంది. చంద్రగిరి మండలం మామండూరు గ్రామానికి చెందిన వరలక్ష్మి భర్త గురవయ్యతో కలిసి జాతీయ రహదారి పక్కన చిన్నపాటి టిఫిన్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. శనివారం రాత్రి టిఫిన్ సెంటర్‌ను మూసివేసి అక్కడే మంచంపైన నిద్రించారు. ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి వరలక్ష్మి మెడలోని బంగారు కాసుల హారాన్ని లాక్కొని పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు చంద్రగిరి సీఐ రాజశేఖర్ తెలిపారు.


మొక్కుల చెల్లింపు



అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుమల: టీటీడీ చైర్మన్‌గా భూమన కరుణాకర్ రెడ్డి నియమితులు కావడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమల అఖిలాండం వద్ద కొబ్బరి కాయలు కొట్టి శ్రీవారికి మొక్కులు తీర్చుకున్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ మునిరామిరెడ్డి

తిరుపతి మంగళం: టీటీడీ చైర్మన్‌గా భూమన కరుణాకర్ రెడ్డిని నియమించడంపై 8వ డివిజన్ కార్పొరేటర్ ముని రామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మూలస్థాన ఎల్లమ్మ అమ్మవారికి 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా కనకాభిషేక మహోత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీవాసవి ఆర్యవైశ్య సేవా సమాజం ఆధ్వర్యంలో శ్రీపద్మావతి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య వృద్ధ దంపతులకు కనకాభిషేక మహోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా 11 మంది రుత్విక్కులు గోపూజ, కలశస్థాపన, హోమాలు చేశారు. సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు, మువ్వల నరసింహులు, పామిడి సత్యనారాయణ, రామమూర్తి, సురేష్ పాల్గొన్నారు.

ఆరోగ్య చంద్రగిరే లక్ష్యంగా చెవిరెడ్డి సేవలు

- మంగళం పంచాయతీల్లో ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన
- 12 రోజుల్లో 11 వేల మందికి వైద్య సేవలు
- ఒక్కొక్కరికి రూ.4 వేల వైద్య పరీక్షలు
- చెవిరెడ్డి కుటుంబానికి రుణపడి ఉంటామంటున్న ప్రజలు



సప్తగిరినగర్ వైద్య శిబిరంలో వైద్య సేవలపై ప్రజలను అడిగి తెలుసుకుంటున్న పంచాయతీ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి, అధ్యక్షులు మహ్మద్‌కాసీమ్

తిరుపతి మంగళం : ఆరోగ్యశ్రీ పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించిన మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి ఆశయాల సాధనకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన నియోజకవర్గ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా వైద్య శిబిరాలు ఏర్పాటుచేయిస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.4 వేలు విలువైన వైద్య పరీక్షలను ఉచితంగా చేయిస్తూ మందులు కూడా పంపిణీ చేస్తున్నారు. తద్వారా ఆరోగ్య చంద్రగిరే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెవిరెడ్డి కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటామని చెబుతున్నారు.

ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన

ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మంగళంలోని సప్తగిరినగర్, రణధీర్‌పురం, తిరుమలనగర్, మంగళం పంచాయతీల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉచిత వైద్య సేవలను పొందారు. రూ.వేలు ఖర్చు చేసి వైద్య పరీక్షలు చేయించుకోలేని తమకు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మంచి చేశారని కొనియాడుతున్నారు.

11 వేల మందికి ఉచిత వైద్య సేవలు

ఒక్కొక్క పంచాయతీలో మూడు రోజుల చొప్పున సప్తగిరినగర్, రణధీర్‌పురం, తిరుమల నగర్, మంగళం పంచాయతీల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. 11 వేల మంది వైద్య సేవలు పొందారు. సప్తగిరినగర్ పంచాయతీలో 2600 మంది, రణధీర్‌పురం పంచాయతీలో 2500 మంది, తిరుమలనగర్ పంచాయతీలో 2700 మంది, మంగళం పంచాయతీలో 2200 మంది ఉచిత వైద్య సేవలను పొందారు. రూ.4 వేలు విలువ చేసే బీపీ, షుగర్, రక్త పరీక్షలు, ఈసీజీ, కొలెస్ట్రాల్ వంటి వాటితో పాటు అనేక జబ్బులకు ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రూ. వేల విలువ చేసే మందులను సైతం ఉచితంగా పొందారు.

చల్లంగా ఉండాలయ్యా



అన్ని సమయాల్లోనూ అండగా ఉంటున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన తనయుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చల్లంగా ఉండాలి. కార్పొరేట్ వైద్య పరీక్షలను పేదల ఇంటి ముంగిటనే ఉచితంగా చేయించి మందులు కూడా ఇవ్వడం అభినందనీయం. చెవిరెడ్డి కుటుంబానికి రుణపడి ఉంటాం.

– డి.సుభాషిణి, సప్తగిరినగర్ పంచాయతీ

ఏదో ఒక రూపంలో ఆదుకుంటున్నారు



ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఎప్పుడూ ఏదో ఒక రూపంలో ఆదుకుంటున్నారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సేవలందించారు. ఇప్పుడు వైద్య శిబిరాలు పెట్టి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని గెలిపించుకుని రుణం తీర్చుకుంటాం.

– రాధాకృష్ణ, సప్తగిరినగర్ పంచాయతీ

సంతలో అన్నదానం



చంద్రగిరి సంతలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చిరువ్యాపారులు, రైతులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటోందని ఎంపీటీసీ సభ్యుడు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి అన్నారు. ఆదివారం చంద్రగిరి సంతలో ఎమ్మెల్యే సహకారంతో వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి రెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీ దినసరి మార్కెట్‌లో ఎలాంటి రుసుం చెల్లించకుండా చెవిరెడ్డి కుటుంబం రైతులను ఆదుకుంటోందని తెలిపారు. ఆయా సంతలకు వస్తున్న చిరువ్యాపారులు, రైతులకు, ప్రజలకు అన్నదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ బండారు హేమచంద్రారెడ్డి, నాయకులు కోటీశ్వర్ రెడ్డి, నవీన్ రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

వేడుకగా మాతమ్మ జాతర



దుర్యోధనుడి ప్రతిమ



మాతమ్మకు సారె సమర్పిస్తున్న మోహిత్‌రెడ్డి



భీముడి పాత్రధారితో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం చిగురువాడ పంచాయతీలో మాతమ్మ జాతర అత్యంత వేడుకగా జరిగింది. వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చిగురువాడ సర్పంచ్ ముచ్చెలి ప్రదీప్‌కుమార్‌రెడ్డితో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో వివిధ రంగులతో తీర్చిదిద్దిన మాతమ్మ ప్రతిమ విశేషంగా ఆకట్టుకుంది.

పాతకాల్వలో..

పాతకాల్వ పంచాయతీలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

మాతమ్మకు సారె సమర్పణ

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం కందులవారిపల్లి మాదిగవాడలో మాతమ్మ జాతర ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మోహిత్ రెడ్డిని సత్కరించి ఆశీర్వచనం అందజేశారు. ప్రజలతో మోహిత్ రెడ్డి ఆప్యాయంగా మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, కందులవారిపల్లి ఎంపీటీసీ సభ్యుడు రాజయ్య, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, రంగంపేట డివిజన్ అధ్యక్షుడు బోస్‌చంద్రారెడ్డి పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం దుర్గ సముద్రం పంచాయతీలోని ద్రౌపదీ సమేత ధర్మరాజు ఆలయ ప్రాంగణంలో మహాభారత ఉత్సవాలు అత్యంత వేడుకగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో ఆదివారం వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. కళాకారులు ప్రదర్శించిన దుర్యోధన వధ ఘట్టాన్ని ఆసక్తిగా తిలకించారు. వేడుకలకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహణ కోసం రూ.లక్ష విరాళంగా అందించారు. అంతకు ముందు ఉత్సవాలకు వచ్చిన మోహిత్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ నేతలు ప్రసాద్‌రెడ్డి, మిట్టపల్లి నాగిరెడ్డి, జ్యోతినాథ్‌రెడ్డి, ఆదెం మునిరెడ్డి, ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. దుర్యోధన వధను వీక్షించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఎమ్మెల్యే భూమనకు అభినందనల వెల్లువ





గంగమ్మ ఆలయంలో వేద పండితుల ఆశీర్వాదం పొందుతున్న భూమన, శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష



రుయా డెవలప్‌మెంట్ చైర్మన్, స్విమ్స్ వైద్యులు

తిరుపతి కల్చరల్: టీటీడీ చైర్మన్‌గా నియమితులైన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. ఆదివారం పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, టీటీడీ ఉద్యోగులు ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.





ఎమ్మెల్సీ రెడ్డి, జడ్జి వీర్రాజు







శుభాకాంక్షలు తెలుపుతున్న టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, బోర్డు సభ్యులు, కమిషనర్ హరిత, ఎస్‌కే బాబు, ముద్రనారాయణ, కోటూరి ఆంజనేయులు

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వైద్యనాథన్, తిరుపతి ఎంపీ గురుమూర్తి, తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్, తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే బ్రిజేంద్రారెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.





తిరుపతి ఎంపీ గురుమూర్తి, తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

ఆర్‌బీకేల్లో అందుబాటులో ఎరువులు

భాకరాపేట: రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఎరువులు ఉన్నాయని ఎర్రావారిపాళెం వ్యవసాయాధికారి ఖాదర్‌బాషా అన్నారు. వరి నాట్లు వేసే రైతులు ఎకరాకు 35 కిలోల చొప్పున యూరియా, 50 కిలోల డీఏపీ, 35 కిలోల ఎంఓపీ ఎరువులను వేయాలన్నారు. ఆర్‌బీకేల్లో యూరియా రూ.266.50, డీఏపీ రూ.1350గా ఉందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం తక్కువగా ఉండడంతో 80 శాతం రాయితీతో రైతులకు ఉలవలు అందజేస్తామన్నారు. ఇప్పటికే మండలంలో 1,268 మంది రైతులకు 40 శాతం రాయితీతో 750 క్వింటాళ్లు వేరుశనగ విత్తనాలు అందజేశామని తెలిపారు. బయోమెట్రిక్ విధానంలో విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.



రైతులకు ఎరువులు అందజేస్తున్న వ్యవసాయాధికారి

చంద్రబాబువి దిగజారుడు విమర్శలు

- ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం



తిరుపతి కల్చరల్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దిగజారి విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. ఎమ్మెల్సీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీలో ఒక నాయుడు వడ్డు దంచి బియ్యం తీస్తుంటారని, ఇంకో నాయకుడు బియ్యాన్ని నూకలు చేసి కోళ్ల ఫారం పెట్టుకుంటారని, మరో నేత దోశ పండి రుబ్బుకొని కుటుంబాన్ని పోషించుకుంటారని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ ఇంటి పేరును అవమానించినందుకు లోక్‌సభ సభ్యత్వాన్ని పోగొట్టుకున్న రాహుల్ గాంధీని చూసి గుణపాఠం తెచ్చుకోకపోతే జరిగే పరిణామాలను ఎదుర్కోక తప్పదని గుర్తు చేశారు. బియ్యం ఇంటి పేరును అవమానించినందుకు పరువు నష్టం దావా వేసేందుకు న్యాయ సలహా కోసం న్యాయ నిపుణులను సంప్రదిస్తున్నట్లు వెల్లడించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు తన సహాయ సహకారాలు అందిస్తూ ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్మికుల మన్ననలు పొందుతున్నారన్నారు. దీంతో టీడీపీకి వచ్చే ఎన్నికల్లో శృంగభంగం తప్పదనే అక్కసుతో తన స్థాయిని మరిచిపోయి విమర్శలు చేయడం మాజీ ముఖ్యమంత్రికి తగదన్నారు. 75 శాతం బీసీ జనాభా ఉన్న కుప్పంను కబ్జా చేసి బీసీలకు బాబు తీరని నష్టం చేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మేక్ ఇన్ ఇండియా పథకంలో భాగంగా రేణిగుంట విమానాశ్రయం చుట్టుపక్కల సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ కంపెనీలు, అనంతపురంలో కియా ఫ్యాక్టరీ వచ్చింది తప్ప టీడీపీ ప్రభుత్వం తీసుకురాలేదని స్పష్టం చేశారు. మీడియాను తన గుప్పట్లో పెట్టుకుని మాయోపాయాలతో తిమ్మిని బమ్మిని చేస్తున్న నేత బాబు అని తెలిపారు. అయితే సోషల్ మీడియా యుగంలో యువత సత్యాన్ని తెలుసుకుని టీడీపీకి వచ్చే ఎన్నికల్లో కర్రకాల్చివాత పెడతారని హెచ్చరించారు.

చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌కు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

-కేసు నమోదు నేపథ్యంలో డీఎస్పీ ముందు హాజరు



డీఎస్పీ యశ్వంత్ ముందు హాజరైన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆదివారం సాయంత్రం చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. పుంగనూరులో టీడీపీ కిరాయి మూకల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా చంద్రగిరిలో పార్టీ శ్రేణులతో కలిసి మోహిత్‌రెడ్డి మౌన నిరసన ర్యాలీ నిర్వహించారు. అనుమతి లేకుండా ర్యాలీ చేయడంపై మోహిత్‌రెడ్డితో పాటు మరో 34 మంది వైఎస్సార్‌సీపీ నాయకులపై చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ యశ్వంత్ ఎదుట మోహిత్‌రెడ్డి, పార్టీ నాయకులు హాజరయ్యారు. తాము ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించలేదని, తమ పార్టీ కార్యకర్తలు, పోలీసులపై జరిగిన దాడిని నిరసిస్తూ మౌన నిరసన ర్యాలీ మాత్రమే చేశామని, తమపై ఎందుకు కేసు నమోదు చేశారని మోహిత్‌రెడ్డి ప్రశ్నించారు. పోలీస్ అనుమతి లేకుండా మౌన నిరసన ర్యాలీ చేపట్టినందుకే కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నియోజకవర్గంలో అనుమతులు తీసుకోకుండా ఎవరు కార్యక్రమాలు చేపట్టినా ఇదే విధంగా చట్టప్రకారం పోలీసులు చర్యలు తీసుకోవాలని మోహిత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

సమభావనే అయ్యప్ప దీక్ష పరమార్థం

- ట్రావన్‌కోర్ దేవస్వం బోర్డు అధ్యక్షుడు ఆనందగోపన్



మాట్లాడుతున్న ట్రావన్ కోర్ బోర్డు అధ్యక్షుడు ఆనందగోపన్

తిరుపతి కల్చరల్: దేవుని ఎదుట అందరూ సమానులే అన్న సమభావన ఒక్క శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలో మాత్రమే కనిపిస్తుందని ట్రావన్ కోర్ దేవస్వం బోర్డు అధ్యక్షుడు ఆనందగోపన్ అన్నారు. రాచవీడు అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మహతి కళాక్షేత్రంలో హరివరాసనం శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. అయ్యప్ప తత్వాన్ని భక్తులకు తెలిపేందుకు వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. కేరళ, తమిళనాడు తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున అయ్యప్ప భక్తులు శబరిమలకు వస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ట్రావన్ కోర్ దేవస్వం బోర్డుకు మధ్య సత్సంబంధాలు ఉండేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్తీక మాసంలో 41 రోజుల దీక్ష ఎంతో విశిష్టమైందన్నారు. పవిత్రమైన పంబా నదిలో భక్తులు వస్త్రాలు విడిచి మురికికూపంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీక్షా సమయంలో రోజు 1.30 లక్షల మంది స్వామిని దర్శించుకుంటున్నట్లు తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు బోర్డ్ కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రావన్ కోర్ బోర్డు సభ్యులు విష్ణు నంబూద్రి, శంకరన్ నంబూద్రి, రాస్ వ్యవస్థాపకుడు సుబ్రమణ్యం స్వామి, గురుస్వాములు చంద్రమౌళి స్వామి పాల్గొన్నారు.

కష్టజీవుల గొంతు గద్దర్

తిరుపతి కల్చరల్: విప్లవకవి, గాయకుడు గద్దర్ మృతి తీరని లోటని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర నేత సాకం నాగరాజు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న అన్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. సంతాపం ప్రకటించిన వారిలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, తిరుపతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతారవి, జి.నాగరాజు ఉన్నారు.

మహాలక్ష్మి మహాయాగ యజ్ఞం



ప్రవచనం చేస్తున్న కైలాస్‌చంద్రస్వామీజీ

తిరుపతి కల్చరల్: స్థానిక డీబీఆర్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన 225 కుండలాల యాగ మండపంలో ఆదివారం శ్రీమహాలక్ష్మి మహాయాగ యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు శాస్త్రోక్తంగా వేదపారాయణం, సహస్ర కలాభిషేకం చేశారు. సాయంత్రం ఝులారియా పీఠాధిపతి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమన్నారాయణస్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీమద్భాగవత ప్రవచనంలో కైలాస్ చంద్రస్వామీజీ గజేంద్ర మోక్షం, సముద్ర మథనం, శ్రీరామ్ అవతార్, శ్రీకృష్ణజన్మాష్టమి వంటి ఘట్టాలను విపులంగా వివరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కుప్పాల గిరిధర్ కుమార్, శ్రీధర్, కమిటీ సభ్యులు నవీన్ మహేశ్వరి సంజయ్, సంజయ్, మధుసూదన్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులుగా గుర్తించండి

తిరుపతి కల్చరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టూ వీలర్ మెకానిక్స్‌ను అసంఘటిత కార్మికులుగా గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ టూవీలర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు డి.ధర్మ, ఆవుల మునిరెడ్డి విజ్ఞప్తి చేశారు. తిరుపతికి వచ్చిన జాతీయ బీసీ కమిషన్ చైర్మన్, జస్టిస్ ఈశ్వరయ్యను అసోసియేషన్ నేతలు ఆదివారం పద్మావతి అతిథి గృహంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి టూ వీలర్స్ మెకానిక్స్‌ను ఆదుకోవాలని కోరారు. నూతన టెక్నాలజీపై కార్మికులకు అవగాహన, ప్రమాద బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని ఈశ్వరయ్య హామీ ఇచ్చారు. అసోసియేషన్ నేతలు లక్ష్మణరావు జలంధర్, గురునాథ ఆచారి, రవి, సోమనాథ ఉన్నారు.